www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 డిసెంబర్ 2024
5
వైఎస్ఆర్



పెద్దదర్గాను సందర్శించడం సంతోషంగా ఉంది
- ప్రముఖ సినీ నటి మీనాక్షిచౌదరి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప పెద్ద దర్గాను సందర్శించడం సంతోషంగా ఉందని గుంటూరు కారం, గోట్, లక్కీ భాస్కర్ సినిమాల హీరోయిన్ మీనాక్షి చౌదరి అన్నారు. గురువారం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమీన్ పీర్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ లక్కీభాస్కర్‌ను ఆదరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలోనే ఒక పెద్ద ప్రాజెక్టు చేస్తున్నానని, త్వరలో వివరాలు ప్రకటిస్తానని చెప్పారు.



ప్రార్థనలు చేస్తున్న మీనాక్షి చౌదరి

'ఉక్కు'కు సమాధి!

- కేంద్రంలోని బిజెపి సర్కారు ఝలక్
- చీమకుట్టిన దొంగలుగా ప్రధాన పార్టీలు
- స్థానిక బిజెపి ఎమ్మెల్యేకు పట్టని వైనం
- ప్రజాసంఘాల నాయకుల ఆగ్రహం



2019లో కడప ఉక్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జగన్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీకి కేంద్రంలోని బిజెపి సర్కారు సమాధి కట్టింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యుపిఎ-2 సర్కారు జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పలురకాల సర్వేలు, టాస్క్‌ఫోర్స్ అధ్యయనాల పేరుతో నటించింది. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం ప్రధాన ఎజెండాగా మారింది. జిల్లాలోని జమ్మలమడుగు ప్రజానీకం బిజెపి అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డిని గెలిపించి గురుతర బాధ్యతను కట్టబెట్టింది. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి, కూటమి భాగస్వామిగా మారిన టిడిపి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీలిచ్చి మరోసారి చీమకుట్టిన దొంగల్లా వ్యవహరించాయి. మంగళవారం జనసేన ఎంపీ పార్లమెంట్‌లో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం పరిశీలనలో లేదని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి ప్రకటనపై బిజెపి ఎమ్మెల్యే, కూటమి తరపున గెలిచిన ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో చలనం లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ని అమలు చేసి తీరుతామని స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలావుండగా కూటమి మిత్రపక్ష సార్వత్రిక ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం కూడా చెప్పడం లేదు. దీనిపై రాష్ట్ర, జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా ప్రజానీకం మేల్కొన్నారని అవకాశం లేకపోలేదు. కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన బిజెపి, జనసేన నాయకత్వాలు ప్రజా నీకానికి స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షంలో జిల్లా ప్రజానీకం తమకు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని ఉక్కు డిగా కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

కేంద్రం అబద్ధాల కోరు

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఫీజుబులిటీ లేదనడం పచ్చి అబద్ధం. ఐరన్‌ఓర్‌తో పాటు ఉక్కు తయారీలో కీలక పాత్ర పోషించే సున్నం, నికెల్, డోలమైట్ వంటి కీలక ముడిసరుకులు సైతం జిల్లాలో లభ్యమవుతున్నాయి. దేశంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఐరన్‌ఓర్ లేదని గమనించాలి. ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది.

- జి.చంద్రశేఖర్, ఉక్కు సాధన కమిటీ కన్వీనర్, కడప.

ఫీజుబులిటీ పేరుతో ద్రోహం

ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ఫీజుబులిటీ లేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహం చేస్తోంది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రధాన హామీకి నిబద్ధత చూపాల్సి ఉంది. జిల్లాలో పరిశ్రమను ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరులు లేదనడం దారుణం.

- గాలి చంద్ర, రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, కడప.

'ఉక్కు'ను ఏర్పాటు చేసే వరకూ పోరాడుతాం

- ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ జి.చంద్రశేఖర్



కడపలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసే వరకు పోరాడుతామని ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. గురువారం ఆర్‌టిసి బస్టాండ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ వద్ద 'కడప జిల్లా ఉక్కు సాధన ఐక్యవేదిక' ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కొలువుతీరిన ఎన్‌డిఎ ప్రభుత్వం శీతాకాల పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జనసేన ఎంపీ కడప ఉక్కు పరిశ్రమపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి జవాబు చెబుతూ కడప ఉక్కు నిర్మాణం ఎన్‌డిఎ ప్రభుత్వం అజెండాలో లేదని ప్రకటన చేయటం బాధ్యతారాహిత్యమైన చర్య అన్నారు. రాజ్యాంగంలో వెనుకబడిన, కరువు తీవ్రమైన ప్రాంతాలలో భారీ పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వం నిర్మించాలని, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని, లిఖితపూర్వకంగా ఆదేశించబడినదని అన్నారు. 2014లో 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం' పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతిచేత రాజముద్రతో 'చట్టం రూపం'సంతరించుకుందని పేర్కొన్నారు. అప్పట్లో పార్లమెంటులో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బిజెపి ఈ చట్టాన్ని గౌరవిస్తామని నమ్మబలికారన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో, నూతన ఆంధ్రప్రదేశ్‌కు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం జాతీయ ప్రాజెక్టుగా హోదా, జాతీయ రైల్వే జోన్, 42 కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు, కడప ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ ఉక్కు కర్మాగారాల నిర్మాణ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో నిర్మాణం వంటి వాగ్దానాలు చేసిందని చెప్పారు. 2014 నుంచి 2024 వరకు కేంద్రంలో అధికారంలో మూడు దఫాలుగా ఉంటున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ ఒక్క దానిని అమలు చేయలేదని వాపోయారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన ద్రోహం చేసిన బిజెపిని రాష్ట్ర ప్రజలకు క్షమించరన్నారు. 2007లో సిఎం హోదాలో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చిటిమిటి చింతల వద్ద, 2014 తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ కు మొదటి సిఎం అయిన నారాచంద్రబాబు నాయుడు 'కంబాలదిన్నె' వద్ద, 2019లో సిఎం హోదాలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 'కన్యతీర్థం' వద్ద రెండు దఫాలు, రెండు డిఫాల్ట్ కంపెనీలతో శంకుస్థాపనలు చేసి 'శిలాఫలకాల ఉక్కు పరిశ్రమ' గా దీన్ని మార్చారని గుర్తు చేశారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం కడప జిల్లా ఉక్కు సాధన ఐక్యవేదిక ఏర్పాటు చేశామని చెప్పారు. దీని ఆధ్వర్యంలో అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా అనుకూల మేధావులు కలిసికట్టుగా ఇప్పటివరకు ఉద్యమిస్తూ వస్తున్నారన్నారు. ఇప్పటికే ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సిపిఎం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరిని పిలిపించి భారీ బహిరంగ సభ నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా సంతకాల సేకరణ, మానవహారాలు, సదస్సులు, ఆఫీస్ ఎదుట భారీ ఆందోళనలు, బైక్ ర్యాలీలు, పాదయాత్రలు పెద్ద ఎత్తున నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థి, యువజన, కార్మిక, జిల్లా ప్రజలతో పెద్ద ఎత్తున కడప ఉక్కు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమాలు పోరాటాలు ఉధృతం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామమోహన్, సుబ్బమ్మ, మనోహర్, దస్తగిరి రెడ్డి, కామనూరు శ్రీనివాసులురెడ్డి, అన్వేష్, రామక్రిష్ణారెడ్డి, కుమారస్వామి రెడ్డి, చంద్రారెడ్డి, గోపాల కృష్ణయ్య, వెంకట సుబ్బయ్య, శివకుమార్, విజయ్, రవి, రాహుల్, నరసింహ, ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల(కాశినాయన) : కడప స్టీల్ ప్లాంట్ పరిశ్రమ లేదని కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటించడాన్ని ఖండిస్తూ పోరుమామిళ్ల అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, మండల కమిటీ సభ్యులు సుందరయ్య, గురువా శ్రీనివాసు, కుసులూరి, రవి, బీబీ, లాల్బుసేన్, వరలక్ష్మీ, జమాల్, రామచంద్రయ్య, ఓబులయ్య, పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు యువకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : కడప ఉక్కు కోసం రాష్ట్ర ఎంపీలు రాజీనామా చేసి ఉక్కు పరిశ్రమ సాధించాలని జమ్మలమడుగు సిపిఎం పట్టణ కార్యదర్శి జి. ఏసురత్నం, కాంగ్రెస్ ఎస్‌సి-ఆర్గనైజేషన్ కన్వీనర్ ఇ. శివమోహన్ రెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం ఉక్కు సాధన- ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ కలిసి ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎ.వినయ్ కుమార్, నరేంద్ర, దస్తగిరి, మునయ్య, నన్నే, బాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దిప్రకాశం, శ్రీనాథ్, సుబ్బు, నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు : ఉక్కు సాధన ఐక్యవేదిక బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఉక్కు సాధన ఐక్యవేదిక బద్వేలు పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్ష- కార్యదర్శులు షేక్. మస్తాన్ షరీఫ్, ఎస్.కె. ఆదిల్, నాయకులు నాగేంద్రబాబు, యువరాజు, రాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు పట్టణ నాయకులు కె.శివకుమార్, బాబయ్య, బాలస్వామి, ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకులు అనంతమ్మ ,ఫాతిమా మస్తాన్ బీ,ఖైరున్ బీ,రామలక్షుమ్మ, కెవిపిఎస్ పట్టణ అధ్యక్షులు రాయప్ప నాయకులు ఓబయ్య, ఆవాజ్ పట్టణ కార్యదర్శి షేక్ అన్వర్ బాషా, వికలాంగుల సంఘం నాయకులు వెంకటపతి, వెంకటేశ్వర్లు ,ప్రసాదు కళాకారుల సంఘం పట్టణ నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయం తరలింపు తగదు

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఎపిజిబి ప్రధాన కార్యాలయం తరలింపు తగదని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ' నాయకులు రఘునాథ్ రెడ్డి, నాయకులు లక్ష్మిరాజా మాట్లాడుతూ ఎపిజబి ప్రధాన కార్యాలయం 20 సంవత్సరాల కిందట పూర్తి సౌకర్యాలతో కడప నగరంలో 50 సెంట్ల విస్తీర్ణంలో రూ. కోట్లు ఖర్చుపెట్టి నిర్మాణం చేసిందన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒకే రాష్ట్రం - ఒకే గ్రామీణ బ్యాంకు పేరుతో అన్ని గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తోందన్నారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఎపిజిబి సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో పూర్వ కడప, అనంతపురం, కర్నూల్, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వ్యాప్తంగా ఖాతా దారులను కలవడం, పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్, కరపత్రాలు పంచడం, పోస్టర్ల విడుదల, ప్రస్తుత, రెండు వారాల్లో కడప, ప్రొద్దుటూరు, బద్వేల్‌లలో ప్రాంతీయ సదస్సులు కడప, అనంతపురంలో జనకవనం పేరుతో సాహితీ కార్యక్రమాలు అనంతపురం, కదిరిలో రౌండ్ టేబుల్ సమా వేశాలు, విద్యుత్ సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపడుతామన్నారు.

ఆచార్య ఈశ్వర్‌రెడ్డికి 'తుమ్మల' సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డికి తుమ్మల సీతారామయ్య సాహితీ పురస్కారం అందిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ సాహిత్యంలో కృషిచేసే వారిని గుర్తించి ప్రతి సంవత్సరం ఒక రచయితకు ఇస్తున్నామన్నారు. 2024 సంవత్సరానికి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఈనెల 7 న గుంటూరు బుక్ ఫెస్టివల్‌లో భాగంగా జరుగుతున్న సాహిత్య కార్యక్రమంలో పురస్కార గ్రహీతను రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరిస్తామని పేర్కొన్నారు.

ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు శోచనీయం

ప్రజాశక్తి - కడప : ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయమని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బొగ్గుల గురప్ప నాయుడు ఆరోపించారు. కడప న్యాయవాదుల సంఘం సమావేశ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ నడిబొడ్డున కడపలో ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయకపోవడం సబబు కాదన్నారు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం కేసుల సంబంధిత కోర్టులు తిరుపతిలో పెట్టడం వల్ల అక్కడి పవిత్రత దెబ్బతింటుందన్నారు. ఈ విషయంపై ఈనెల 7 వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో కడప న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి వై. టి. జె. కెనడి పాల్గొన్నారు.

సరైన వృత్తిని ఎంచుకోవాలి

ప్రజాశక్తి -కడప : పిల్లలు ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా సరైన కెరియర్‌ను ఎంచుకోవాలని స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ సూచించారు. స్టెప్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం- కెరీర్ కౌన్సిలింగ్' పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరచుగా విద్యార్థులు ఏ కోర్సులో చేరాలని అనేది సరిగ్గా అంచనా వేయలేక సతమతమవుతుంటారని, సాధారణంగా తోటివారి ఒత్తిడి, ఎక్కువ మంది ఎంపిక చేసుకున్న కోర్సును ఎంచుకుంటారని అన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా సమయం తీసుకుని సరియైన కెరీర్ ను ఎంచుకోవాలని తెలిపారు. రిసోర్స్ పర్సన్ కె. పృథ్వీ రాజ్ మాట్లాడుతూ నేటి యువత చేస్తున్న పొరపాటుల గురించి వివరించారు. యువత చెడు స్నేహాలకు, రాష్ డ్రైవింగ్, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియా/ మూవీస్, లవ్, కమ్యూనిటీ ఇంటరెస్ట్స్, తప్పుడు ప్రవర్తన మొదలగు వాటి పై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు, ప్రిన్సిపల్ యస్. నూర్జహాన్, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నా భర్త మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

వర్షంలోనూ రోడ్డుపై బైఠాయించి ఉపాధ్యాయుడి సతీమణి నిరసన
ఉపాధ్యాయులు, సంఘాల నాయకుల సంఘీభావం



రాయచోటి : ప్రభుత్వాస్పత్రి వద్ద బైఠాయించి వర్షంలోనూ నిరసన చేస్తున్న మృతుడి సతీమణి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తన భర్త మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మృతి చెందిన ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ సతీమణి గురువారం రోడ్డుపై బైఠాయించి వర్షంలో నిరసన తెలియజేశారు. రాయచోటి ప్రభుత్వాస్పత్రిలో ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతదేహాన్ని వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామమైన కడపకు తరలిస్తుండగా మృతి చెందిన ఉపాధ్యాయుడి సతీమణి రెహిమూన్ బేగం తన కుటుంబ సభ్యులు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులతో కలిసి జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అంబులెన్స్‌కు అడ్డంగా కూర్చొని తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుండి కదలనంటూ నిరసనకు దిగారు. తన భర్తను అన్యాయంగా కొట్టి చంపేశారు అంటూ బోరునా విలిపించింది. దీన్నంతటికి కారణం స్కూల్ టీచర్లే అంటూ ఆరోపించింది. 'కొట్టండి మేము చూసుకుంటాం' అని టీచర్లు ప్రోత్సహించడం వల్లే తన భర్తపై విద్యార్థులు దాడి చేసి అన్యాయంగా చంపేశారంటూ ఆరోపించారు. ఇలాంటి టీచర్లకు కఠిన శిక్ష వేయాలంటూ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడు మృతి పట్ల సంఘీభావ ర్యాలీ

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి మొబైల్ టార్చ్‌తో తహశీల్దార్ కార్యాలయం నుండి బంగ్లా సర్కిల్ వరకు ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు భారీ ర్యాలీ చేపట్టి మనవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ తరగతి గదిలో విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు భద్రత కరవైందని తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.2 కోట్ల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి కలెక్టర్‌కు వినతి

పట్టణంలోని కొత్తపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ అహమ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించి ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టర్ శ్రీధర్‌ను జిల్లా ఉపాధ్యాయ ఐక్య వేదిక కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సత్ప్రవర్తన లేని విద్యార్థులను క్రమశిక్షణ కోసం మందలిస్తే తరగతి గదిలోనే విచక్షణారహితంగా అతి కిరాతకంగా కొట్టి హత్య చేయడం సభ్య సమాజం ఎంతో సిగ్గుపడవలసిన చర్యన్నారు. ఉపాధ్యాయుడి మృతిపై విచారణ వేసి దోషులును కఠినంగా శిక్షిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఎ.శివారెడ్డి, జాబీర్, రెడ్డప్పరెడ్డి, హరిబాబు, శిబాతుర్ రెహమాన్, జక్రియా, మున్వర్ బాషా, ఇలియాస్, రామాంజినేయులు, రియాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కడప అర్బన్ : రాయచోటిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కోరారు. ఆసుపత్రిలో అహమ్మద్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధ్యు లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అపుస్మ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వి.ఆర్.రెడ్డి, నాయకులు రమణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఇషాక్ పాల్గొన్నారు. **మైదుకూరు(చాపాడు) :** ఫ్యాప్టో ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో వనిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, మండలం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, గురివిరెడ్డి, ఉపాధ్యాయులు మొహిద్దిన్‌ఖాన్, సుధాకర్ బాబు, శ్యామలాదేవి, సంజమ్మ, మునీర్ అహ్మద్, మహమ్మద్ బాషా, నరసింహమూర్తి, సురేష్, జబ్బార్, వరప్రసాద్ పాల్గొన్నారు. **వేంపల్లె :** ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షులు బిఎస్ రమణారెడ్డి డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి : ఫ్యాప్టో

బద్వేలు : ఉపాధ్యాయుడు అహమ్మద్ ను అత్యంత హేయంగా తరగతి గదిలోనే కొట్టి చంపిన ఉన్మాదులైన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడిపై దాడి చేసి చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని మధ్యాహ్న భోజన విరామంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం కడపలో జెసి అదితి సింగ్‌ను కలిసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టియు, ఎపిటిఎఫ్, బిటిఎ జిల్లా అధ్యక్షులు ఇలియాస్‌బాష, టి.ఖాదర్‌బాష, జ్యోతి రామచంద్ర బాబు, యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, యుటిఎఫ్ బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ పాల్గొన్నారు.

చెన్నూరు : రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మరణంపై విచారణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎంఇఒ కార్యాలయ ఆరవణలో రెండు గంటల పాటు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు, వెంకట్రామిరెడ్డి, ఎస్‌టియు నాయకులు వెంకటసుబ్బయ్య, పిఆర్‌టియు బాబురెడ్డి, ఆంజనేయులు, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు వీరనారాయణ ఖాదర్ బాషా, గాయత్రి, శోభాలత, సుశీల, మేరీ సునీత, చిన్నపరెడ్డి, శ్రీనివాసులు, వెంకట శివుడు, జయరాజ్, బషీర్ అహ్మద్, లక్ష్మయ్య, వెంకటసుబ్బయ్య, లక్ష్మిరెడ్డి, బాబు, ఖాజా మొయిద్దీన్ పాల్గొన్నారు.



రాయచోటి : సంఘీభావంగా నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



కడపలో జెసికి వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

నేటి నుంచి జనవరి 8 వరకు నిర్వహణ
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ వివాదాలు అన్నింటికీ పరిష్కార మార్గం చూపడానికి ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు గ్రామాలు, మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలు రైతులు వారి సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు. అలాగే ప్రతి ఇంటికీ విఆర్ఒ, ఆర్ఐ, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది రికార్డులతో వచ్చి మీకు సంబంధించిన వివరాలను తెలియజేస్తారని, వాటిని పరిశీలించి ఏవైనా మార్పులుంటే వాటిని విచారణ చేసి సరి చేస్తారన్నారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఫిర్యాదుదారునికి రసీదు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. పెద్ద గ్రామాలు, మండలాలలో రెండు రోజులకు పైగా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులు నిశితంగా పరిశీలించి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామన్నారు. అక్కడ పరిష్కారం కాకపోతే ఆర్‌డిఒ, డిప్యూటీ కలెక్టర్ స్థాయి పరిధిలో వాటిని పరిష్కారమవుతుందని చెప్పారు. సమస్య తీవ్రతను బట్టి 45 రోజు లోపల పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సమస్యల పరిష్కార వేదిక ద్వారా 6 వేలకు పైగా అర్జీలు అందాయని, ఇందులో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులు గ్రామ ప్రజలకు రైతులకు సువర్ణ అవకాశమని, ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు సహకరించాలి : రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం కావడానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల ప్రణాళిక, కార్యాచరణపై జెసి అదితి సింగ్‌తోకలిసి సమావేశం నిర్వహించారు. బద్వేలు ఎమ్మెల్యే డా. దాసరి సుధ, పలువురు రాజకీయ పార్టీ ప్రజాప్రతి నిధులు, రెవెన్యూ, ఎండోమెంట్ శాఖ అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, జెసి అదితిసింగ్

అసాంఘిక శక్తులకు అడ్డాగా విద్యాలయాలు : పిసిసి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో హైస్కూళ్లు, కళాశాలలు వైసిపి పాలనలో మద్యం షాపులుగా, గంజాయి నిలయాలుగా, డ్రగ్స్ కేంద్రాలుగా, అసాంఘిక శక్తుల అడ్డాగా తయారయ్యాయని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని చోట్ల విద్యార్థుల అల్లరిని భరించలేక టీచర్లు ప్రత్యేకించి మహిళా టీచర్లు క్లాసులకు పోవాలంటే భయపడి పోతున్నారన్నారు. విద్యార్థులు అల్లరి చేస్తుంటే మంద లించినందుకు ఏజాజ్ అనే ఫిజిక్స్ ఉపాధ్యాయుడిని దాడి చేయడం విచారకరమన్నారు. ప్రపంచ ఆకలి సూచికలో 127 దేశాలలో మనది 105వ స్థానంలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురికి తక్కు వ లేకుండా బిడ్డల్ని కనమని సిఎం చంద్రబాబు, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత పిలుపు ఇవ్వడం మూర్ఖత్వం అని వాపోయారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయ కులు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, కడప అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయకర్త బండి జకరయ్య, సత్తార్, సలావుద్ధీన్, మల్లెం విజయ భా స్కర్, ప్రసాద్ గౌడ్, మైనుద్ధీన్, రఫీక్, సుబ్బారెడ్డి, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

వైవీయూకు పేటెంట్లు అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం జియాలజీ విభాగం, సిఎస్ఐఆర్ నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త పరిశోధన ద్వారా రెండు ప్రతిష్టాత్మక పేటెంట్లను సాధించడం గర్వంగా ఉందని వైవీయూ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, భూగర్భశాస్త్ర విభాగం ప్రొఫెసర్ సునీత అభినందనలు తెలియజేశారు. 'జియో ఇంటిగ్రేటెడ్ సాయిల్ ప్రాపర్టీ డివైస్ విత్ ఎన్హాన్స్ జిపిఎస్ అక్యురసీ' అనే ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, 'జియో స్పేషియల్ మల్టీ సెన్సర్ సాయిల్ టెస్టింగ్ ప్రోబ్' అనే ఆవిష్కరణకు యూకె డిజైన్ పేటెంట్ లభించడం గర్వకారణమన్నారు.

రేపు కడపకు డిప్యూటీ సిఎం పవన్

- మున్సిపల్ హైస్కూల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి హాజరు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/కడప అర్బన్

ఈ నెల ఏడవ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లాలో పర్యటించనున్నారు. కడప నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉదయం 10.15 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. 10.20 గంటలకు రోడ్డు మార్గాన హైస్కూల్‌కు చేరుకుని కార్యక్రమ అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట బయల్దేరనున్నారు. **ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ ..**పవన్ కల్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం స్థానిక మున్సిపల్ హై స్కూలు (మెయిన్)ను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధి కారులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యేవారికి సీటింగ్ కెపాసిటీ తదితర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులను తగు సూచనలు, ఆదేశాలను జారీచేశారు.

లెప్రసీ సర్వే త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి- వల్లూరు : మండలంలో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వే త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎయిడ్స్, టిబి, లెప్రసీ అధికారి డాక్టర్ రవిబాబు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ రూమ్, ల్యాబ్ రూమ్‌ను సందర్శించారు. ఎన్‌సిడి సర్వే మీద మలేరియా, డెంగీ, లార్వా సర్వే, టిబి సర్వే డాక్టర్ పనింద్ర, సిహెచ్ఒ వేణుగోపాల్‌ను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంటువ్యాధులు విస్తరించకుండా నిఘా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.



కౌన్సిలర్ వెంకటరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

కౌన్సిలర్‌ను పరామర్శించిన ఎంపీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో 5వ వార్డు కౌన్సిలర్ తుంగా వెంకటరామిరెడ్డిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేక ఆయన శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. వెంకటరామిరెడ్డి క్లాస్-1 రైల్వే కాంట్రాక్టర్‌గా పేరు పొందారు. పరామర్శలో ఎంపీ అవినాష్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కౌన్సిలర్ నాగిరెడ్డి, వైసిపి నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జయ రామకృష్ణారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

మీకోసం సేవా సంస్థకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - ఖాజీపేట



సన్మానం అందుకుంటున్న విష్ణువర్ధన్

మండలానికి చెందిన మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పుల్లగూర విష్ణువర్ధన్‌కు మదర్ థెరిస్సా సేవ రత్న అవార్డు దక్కింది. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా గురువారం పోరు మామిళ్లలోని మదర్ థెరిస్సా ఫౌండేషన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి, ఫౌండేషన్ ఫౌండర్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, చిత్తా గిరిప్రణీత్ రెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డుతోపాటు సన్మానం అందుకున్నారు. సమాజంలో స్వచ్ఛంద సేవకుల పాత్ర మరువలేనిదని వక్తలు కొనియాడారు.

అధిక రేట్లను నియంత్రించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజల వినోదాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటూ ప్రజల జేబులకు చిల్లు పడేలా ఉన్న అధిక టికెట్ల రేట్లను నియంత్రించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డివైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కుటుంబ సమేతంగా వినోదం కోసం సినిమాలకు ప్రస్తుత రోజుల్లో రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. కొత్త సినిమా ఏదైనా విడుదల సమయంలో విపరీతంగా టికెట్ల రేట్లు పెంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుష్ప-2 సినిమా టికెట్ల రేట్లు చూస్తే కళ్లు బయర్లు కమ్ముతున్నాయన్నారు. సమావేశంలో ఓబులేసు, మోహన్ ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు జమ్మలమడుగులో ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జమ్మలమడుగులో ఉన్న 33-11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు స్థానిక పట్టణ ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమణారెడ్డి సూచన మేరకు ఆయన పేర్కొన్నారు. రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, మోహన్‌రావు, అంజనీకుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్నవారు రాతపూర్వకంగా ఈ వేదికలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల, కమలాపురం, వీరపునాయునిపల్లి, ప్రొద్దుటూరు మండలాల ప్రజలు తమ సమస్యలను ఈ వేదికలో తెలపాలన్నారు.

ఆయా రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - వేంపల్లె



విద్యార్థులతో ఎపి కృష్ణకిషోర్

విభిన్నప్రతిభావంత విద్యార్థులు మనోధైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని, వారికి పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటుందని సమగ్రశిక్ష అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రమణ మూర్తి పేర్కొన్నారు. 65వ అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా గురువారం ఎపి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో కడప ఇండోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విభిన్నప్రతిభావంతుల విద్యార్థులు, సాధారణ పిల్లలతో సమానంగా ఆటల పోటీల్లో పాల్గొని నిరూపించడం సంతోషకరమన్నారు. విభిన్నప్రతిభావంత విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. వీరికి అవసరమైన ఉపకరణాలు అందజేస్తామని చెప్పారు. రెగ్యులర్ పాఠశాలలకు వెళ్లే వారికి రవాణా, ఎస్కార్ట్ అలవెన్సు, బాలికలకు ఉపకార వేతనాలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. క్రీడా పోటీల్లో చేంబల్లి భవిత తరఫున పాల్గొన్న రాజ్‌కుమార్, చందు, విష్ణు, హర్షవర్ధన్, వెంకట తేజ, రవళి, సిద్దిక్ అనే విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటడంతో ఎపి కృష్ణకిషోర్ బహుమతులు అందజేశారు. భవిత విద్యార్థులను ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ జకారీ, ఐఇఆర్టీలు యశోద, సుజాత, సిజివి సుజాత అభినందించారు.

ఎపిజిబిని తరలిస్తే పోరాటం తప్పదు

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం కడప నగరంలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తే పోరాటం తప్పదని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించే విషయాన్ని మార్చుకోవాలని సూచించారు. రాయలసీమ ప్రాంతం అన్ని విధాలా వెనకబడి ఉన్నదన్నారు. అలాంటి తరుణంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప జిల్లాలోనే ఉంచాలని కోరారు. కడప నగరంలోనే ఉంచే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులు, ప్రజలకు మేలు చేయాలే కానీ అన్యాయం చేయకూడదని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేముల

వేముల మండల కేంద్రంలోని వేల్పుల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని యురేనియం, వేల్పులదారాల, బ్రహ్మణం పీడర్లలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామ ప్రజలు, రైతులు గమనించి, విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని విద్యుత్ ఏఇ శ్రీనివాసులు కోరారు.

'ఫెంగల్'తో వరి రైతులు కుదేలు



నేలకొరిగిన వరి పంటను కట్టలు కడుతున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట నూర్పిడి దశకు చేరుకుంది. ఫెంగల్ తుపాను తాకిడికి వరి రైతులు విల విల్లాడిపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అంది వచ్చిన సమయంలో తుపాన్ రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. చేతికి అందే సమయంలో పంట కళ్లముందే నేల కొరుగుతూ ఉంటే రైతుల గుండె తరుక్కుపోతోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు వర్షంలోనే తడుస్తూ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరి కొంతమంది రైతులు నూర్పిడి చేపట్టి ధాన్యం తడవకుండా టార్పలిన్ పట్టలను కప్పుతూ, వర్షం ఆగినప్పుడు ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో కుందు, పెన్నా, కేసీ కాలువ ఆధారంగా 12వేల ఎకరాలకు పైగా వరి పంటను రైతులు సాగు చేపట్టారు. ఇప్పటికే 2వేల ఎకరాలలో పంట నూర్పిడి పూర్తయింది. మిగిలిన పంట అంతా నూర్పిడి దశలో ఉంది. గత నాలుగు రోజులుగా తుపాన్ ప్రభావంతో పంట నేలకొరుగుతోంది. బుధ, గురు వారాల్లో అధిక వర్షపాతం నమోదైంది. అల్లాడుపల్లె, స్థానిక పిహెచ్‌సీ వద్ద, రోడ్లపై ఖాళీ ప్రదేశాల్లో వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసేందుకు పొలాలను పరిశీలిస్తున్నారు.



తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

పంట నష్టం అంచనా : ఎఒ నాగార్జున


ప్రజాశక్తి - ఖాజీపేట

తుపాన్ ప్రభావంతో డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వరి పంట దెబ్బతిందని, ఆ నష్ట అంచనా వేస్తున్నామని ఎఒ నాగార్జున తెలిపారు. ఆ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 320 మంది రైతులకు సంబంధించి 612 ఎకరాలు వరి పంట, 22 ఎకరాల మినుము దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తప్పక చర్యలు తీసుకుంటుందని ఎఒ పేర్కొన్నారు.

పంటల బీమా.. రైతన్నలకు ధీమా

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయ రంగంపై రైతుల దృష్టి రోజురోజుకూ తగ్గిపోతోంది. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, కూలీల కొరత ప్రభావం, ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోవడం, పెట్టుబడి సాయం అందక సాగుకు దూరంగా ఉండడం వంటి అనేక కారణాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం కావడంతో కష్టనష్టాలను ఓర్చుకుంటూ వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల మరింత తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలకు నష్టం జరిగితే వ్యవసాయ బీమా ఉన్నా రైతులకు బీమాపై అవగాహన లేకపోవడంతో మరింతగా నష్టపోవాల్సి వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టి రైతులను ఆదుకుంటుంది. ఈ బీమాపై సరైన అవగాహన లేకపోవడంతో చాలామంది రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. వ్యవసాయపు సాగులో మెలకువలు సూచనలు చేయడంతో పాటు వ్యవసాయ అధికారులు పంటల బీమాపై కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఏడాది రబీలో వరి, వేరుశనగ, టమోటా వంటి పంటలకు బీమాను వర్తింపజేయనుంది. గ్రామ సచివాలయాల్లో ఉండే వ్యవసాయ సహాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు ఫసల్ బీమాపై రైతులకు వివరిస్తూ చైతన్యం తీసుకొస్తున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో వరి, వేరుశనగ పంటలకు మాత్రమే బీమా వర్తించనుంది. ఎకరా వేరుశనగ పంటకు రైతులు రూ.96, వరికి రూ.126 చెల్లిస్తే సరిపోతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా కంపెనీలు రైతులకు పరిహారం అందించనున్నాయి. వరి, వేరుశనగ పంటను మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నారు. వరి పంటకు ఈనెల 31 వరకు, వేరుశనగ పంటకు ఈనెల 15 వరకు బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలంటే రైతు ఆధార్ కార్డు, వ్యవసాయ పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, బీమా నగదు చెల్లింపు రసీదు సమర్పించాలి. రైతులు సమీప బ్యాంకులు, సిఎస్‌సి కేంద్రాల్లో కానీ బీమా చేసుకోవాలి.



సాగులో ఉన్న వరి పంట

సమగ్ర విచారణ జరిపించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలుర ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకల పై సమగ్ర విచారణ జరిపించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్‌జెడి కార్యాలయం ఎడి విజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కడప నగరం లో సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ బాలుర పాఠశాల లో గత మార్చి నెలలో జరిగిన టీచర్ పోస్టుల భర్తీలో పూర్తిగా అవకతవకలు జరిగాయని బహిరంగంగా చర్చ జరుగుతుందన్నారు. ఒక్కొక్క పోస్టుకు లక్షల రూపాయలకు అమ్ముకున్నారన్నారు. అంగట్లో సరుకులగా పోస్టులను అమ్ముకోవడం దారుణం అన్నారు. ఇదంతా విద్యా శాఖ అధికారులకు తెలిసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ బాలుర పాఠశాల లో పోస్టుల భర్తీ పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్,నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి

కడప : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం కడప నగరం శివారులోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011 ను వివరించారు. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వృద్ధులను విడిచిపెట్టిన, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించిన అట్టివారు శిక్షార్హులు అవుతారన్నారు. శిక్షాకాలం గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుం గరిష్టంగా రూ. ఐదు వేలు జరిమానా విధిస్తామని చెప్పారు. అర్హులు తగిన సమాచారం కొరకు, సూచనలకు మరియు న్యాయ సేవల కోసం ప్రతి ఆర్డీవో ఆఫీసు లో సంప్రదించవచ్చునని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ :



విజేతలుగా నిలిచిన విభిన్న ప్రతిభావంతులు

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాల్లో భాగంగా గురు వారం కడప ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఆటల పోటీలలో ఆల్ షిఫా విద్యార్థులు బహుమతులు పొందారు. విభిన్న ప్రతిభావంతుల పిల్లలను ఎంతో శ్రద్ధగా సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో కృషి చేసిన అల్ షిఫా మహమ్మద్ రఫీ ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు సన్మా నించారు. ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఆటల పోటీలలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతుల పిల్లలందరికీ బహుమతులు అందజేశారు. ఆటల పోటీలలో పాల్గొని అల్‌షిపా పిల్లలు ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు.

సర్వే నెంబర్ల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆన్‌లైన్‌లో తమ భూముల సర్వే నెంబర్లు కనపడలేదని, ఆ సమస్యలను పరిష్కరించాలని గురువారం రైతులు తహశీల్దార్ హరినాథ్‌రెడ్డిని వేడుకున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌ను వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలిశారు. 2024 రబీకి సంబంధించిన పంటల బీమా చెల్లించేందుకు వెళితే ఆన్‌లైన్‌లో భూముల సర్వే నెంబర్లు చూపించడం లేదన్నారు. వన్ బీ అడంగల్ మీ సేవా కేంద్రాల్లో తీసుకొని పంటల బీమా చెల్లించేందుకు వెళితే వెనక్కి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. బీమా గడువు ఈనెల 15తో ముగుస్తుందని రైతులు వివరించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని తహశీల్దార్ తెలిపారు.

జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బుడ్డ శనగ సాగులో రైతులు స్వల్ప జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు అని ఎఒ శివమోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని బలపనూరు గ్రామంలో గురువారం శనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ శనగ పంటలో తెగులు అధికంగా ఉందన్నారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రబీ సీజన్‌లో సాగుచేసిన శనగ పంటకు బీమా సంబంధించి పంట విత్తనం వేసిన తేదీపై రైతులకు అపోహ ఉందన్నారు. రైతులు అక్టోబర్, నవంబర్ నెలలో సాగు చేసినట్లు ఇన్సూరెన్స్ పత్రాలపై వేసుకోవచ్చు అన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఫెంగల్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించామని జమ్మలమడుగు మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గొరిగనూరు, గూడెం చెరువు, కన్నెలూరు, అంబవరం గ్రామాల్లో గురువారం వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మండలంలో 34.4 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. దీంతో వరి పంట కోత దశలో ఉండడం వల్ల నేల కొరిగిపోయి, ధాన్యం తడిసిపోయిందన్నారు. ఆయా గ్రామాల్లోని వరి పొలాలను సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేశామన్నారు. ఇప్పటివరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం మేరకు ఆయా గ్రామాలతోపాటు సిరిగేపల్లి, ధర్మాపురం, పెద్దదండ్లూరు, ధర్మాపురం, సున్నపురాళ్లపల్లి, పొన్నతోట, బొమ్మేపల్లి గ్రామాల్లో దాదాపు 925ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఉన్నతాధికారులకు సమర్పించామన్నారు.

మొక్కల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి - ఖాజీపేట

మొక్కలను పెంచడం వల్ల రైతులకు ఆదాయం సమకూరుతుందని మండల వ్యవసాయ అధికారి నాగార్జున పేర్కొన్నారు. మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో గురువారం మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎర్రచందనం, వీరగన్నేరు, మహాగని, శ్రీగంధం వంటి విలువైన మొక్కలను ప్రతి ఒక్కరూ పెంచుకొని ఆర్థిక ప్రయోజనం పొందాలన్నారు. మొక్కలను పెంచడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి సతీష్, కార్యనిర్వాహక అధికారి బి. వీరనరేష్, మాజీ సర్పంచ్ పిచ్చినాయుడు, బాలరాజు, సునీల్, వెంకటేశ నాయుడు, పత్తూరు గ్రామప్రజలు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లకపోతే ఇంటి దగ్గర ధర్నా చేస్తాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రాకపోతే ఆయన ఇంటి వద్ద ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల సమస్యలపై పోరాటం చేయకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై పోరాడుతారని పులివెందుల ప్రజలు వైఎస్ జగన్‌ను 62 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారన్నారు. పులివెందుల ప్రాంత ప్రజల సమస్యలను అసెంబ్లీలో నిలదీయకుండా ఇంటి వద్దనే ఉండడం దారుణమన్నారు. రాష్ట్రంలో పంటల బీమాను భ్రష్టు పట్టించింది వైసిపి ప్రభుత్వమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేశారని, త్వరలోనే అమ్మకు వందనం కూడా అమలు చేస్తామన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల నిర్మాణంపై వైసిపి నాయకులు ఇప్పుడు ఏదో రాద్ధాంతం చేస్తున్నారని, గత అయిదేళ్లల్లో మెడికల్ కళాశాలను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలన్నారు. పాడా ద్వారా పులివెందులలో వందల కోట్లు ఖర్చు చేసినా అభివృద్ధి మాత్రం జరగలేదన్నారు. ఇప్పటికైనా పులివెందులపై అభిమానం ఉంటే సమస్యలపై పోరాడాలని, లేకపోతే రాజీనామా చేస్తే ఈ ప్రాంత ప్రజలు కొత్త ఎమ్మెల్యేను ఎన్నుకొని వారి ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటారన్నారు.

సమస్యలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎమ్మెల్సీకి వినతి

ప్రజాశక్తి - వేముల

రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలపై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ ఉద్యోగాలలోకి తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు తమకు ఎలాంటి ప్రమోషన్ ఛానల్ లేదని, తద్వారా తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

బిసి కులాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



సిఎం చంద్రబాబుకు సమస్యలను తెలుపుతున్న గజ్జల గోవిందు

రాష్ట్రంలోని బిసి కులాలను ఆదుకోవాలని టిడిపి నాయి బ్రాహ్మణ కడప పార్లమెంట్ అధ్యక్షుడు గజ్జల గోవిందు కోరారు. గురువారం మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి బిసి కులాల సమస్యలపై వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా గజ్జల గోవిందు మాట్లాడుతూ జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ పరిధిలోని బిసి కులాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకు పోయామన్నారు. బిసి కులాలకు ఆదరణ పథకం కింద పనిముట్లు, బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను అందించాలన్నారు. ముద్ర రుణాలను అందించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.

బడ్జెట్ కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.270 కోట్లు కేటాయించడం హర్షణీయమని జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు పీవీఎస్‌వి ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో వివిధ కార్పొరేషన్లకు కేటాయింపులతోపాటు మంత్రి సవిత బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కేటాయింపులను ప్రకటించడంతో బడ్జెట్ కేటాయింపుపై ఉన్న అనుమానాలు తొలగిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా లబ్ధి కలిగించవచ్చు అన్నారు. వివిధ కార్పొరేషన్లలో ఇస్తున్న సబ్సిడీ రుణాలు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు కూడా ఇవ్వాలని మంత్రి ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - చాపాడు

భూ సంరక్షణ కోసం రసాయన ఎరువులు, మందుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాఖ జెడిఎ నాగేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపేట రైతు సేవా కేంద్రంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం వల్ల నేలలో, ప్రకృతిలోని జీవరాశులు మధ్య సమతుల్యత లోపిస్తుందన్నారు. సారవంతమైన నేల కోసం సూక్ష్మ జీవులు, సేంద్రియ కర్బనం, వానపాము, నత్త, పీతలు వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు ఎడిఎ కృష్ణమూర్తి, ఎఒ మ్యాగీ, లక్ష్మణ్ , సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతిలో లభించే ఎరువులతో పంటలు సాగు చేస్తే ఖర్చు తక్కువ.. దిగుబడులు ఎక్కువ అని ఎంఒ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఎఒ ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. సహజ సిద్ధ పద్ధతుల ఉత్పత్తులను విరివిగా పండించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా మండలంలో రెండు యూనిట్ల కింద 11 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధ ఃతులను అనుసరించి పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజహత్, రామ సుధ, ముని భూపాలుడు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.